# స్నేహమంటే....?

రచన:
శ్రీ కలగర్ల నరసింహమూర్తి

'అవును ప్రకాష్! మాధవి సౌందర్య దేవత. ఆమె సౌందర్యవాహినిలో, నా జీవన నావ తేలియాడాలి. గులాబీ చక్కదనం, వెన్నెల చల్లదనం ఆమెలో తొణికిసలాడుతున్నాయ్. నేను మాధవిని ప్రేమిస్తున్నాను ప్రకాష్. ఆమె నాకు కావాలి. ఆమె నాకు దక్కాలి. ఆమెలేని జీవితం వ్యర్థం. ఆమె తన ప్రేమ బిక్షతో నన్ను అనుగ్రహించకపోతే, నాకు మరణమే శరణ్యం' అన్నాడు మోహన్.

ప్రకాష్ తలపై పిడుగుపడినట్టయింది. 'హే భగవాన్! ఏమిటీ పరీక్ష నాకు? నేను మాధవిని మనసారా ప్రేమిస్తున్నాను. అదేవిధంగా మాధవికూడా నన్ను వాంఛిస్తోంది. కానీ మోహన్ నాకు ప్రాణస్నేహితుడే! ఇప్పుడు మోహన్ కూడా మాధవి ప్రేమకోసం తహతహలాడుతున్నాడే! ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి? మాధవి ప్రణయ సామ్రాజ్యంకోసం, ప్రియ మిత్రుని హృదయాన్ని గాయపరచి, అందమైన ఆ స్నేహలతను తృంచివేయాలా? లేక ప్రియాతిప్రియమైన స్నేహధర్మాన్ని నిలబెట్టాలని, స్నేహితునికోసం, తన ప్రాణసమానమైన మాధవిని విడనాడి, తను పవిత్ర ప్రేమను విడనాడాలా!' ఏం చెయ్యాలో తోచక ప్రకాష్ నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

కానీ ప్రకాష్, మాధవి పరస్పరంగా ప్రేమించుకున్నారని మోహన్‌కు తెలియదు.

ప్రకాష్ దీనంగా మోహన్ కండ్లలోనికి చూస్తూ 'మోహన్! మాధవి నిన్ను ప్రేమిస్తున్నదో, లేదో తెలుసుకున్నావా?' అన్నాడు.

చటుక్కున మోహన్, ప్రకాష్ రెండు చేతుల్ని పట్టుకున్నాడు.

'ఆ భారం, నీమీద మోపుతున్నాను ప్రకాష్! మాధవి నీతో చనువుగా, సరదాగా ఉంటుంది. కాబట్టి సమయం చూసి, ఆమె, నన్ను ప్రేమిస్తుందో, లేదో తెలుసుకో. ఆమె నన్ను ప్రేమించేటట్టు, నన్ను వివాహం చేసుకోడానికి అంగీకరించేటట్టు, చేయవలసిన భారం నీది. ఈ ఒక్క ఉపకారం చెయ్యి, ప్రకాష్.'

ప్రకాష్ కంపించిపోయాడు. 'ఏమిటి శిక్ష! ఏ కన్యనైతే తాను మనసారా ప్రేమిస్తున్నాడో, ఆ కన్యతోనే నువ్వు ఇంకో వ్యక్తిని ప్రేమించి పెండ్లిచేసుకో, అని తానే స్వయంగా చెప్పాలా? ఇంతకంటే ఘోరమైన నరకం తనకు వేరే ఎక్కడో ఏముంది? 'ఎన్నో మధుర స్వప్నాలు గన్నాను. మాధవిని నాదానిగా జేసుకొని, ఈ లోకంలోనే, ఒక దివ్యలోకాన్ని సృష్టించుకోవాలనుకున్నాను. మాధవికూడా నాతో కలసిపోయే శుభ ఘడియకోసం వేయి కళ్లతో ఎదురు చూస్తోంది. కానీ ఇంకో మూడో వ్యక్తి తృప్తికోసం, మా ఇద్దరి ఆశలు ఆనందాలు, నాశనం కావాలా? ఒక్క వ్యక్తి సంతోషంకోసం, ఇద్దరు ప్రేమికులు బలికావాలా? లేదు. అలా జరగడానికి వీల్లేదు, వీల్లేదు.'

కానీ అంతలోనే అతనిలోని అంతరాత్మ, మానవత్వం మేల్కొన్నాయ్.

'ఆగు ప్రకాష్! ఏమిటా నిర్ణయం? మోహన్, నీకు ఎంత గాఢమైన మిత్రుడో మరచిపోతున్నావా? నువ్వు కఠిన దరిద్రం అనుభవిస్తూ, కాలేజీ జీతం కట్టలేని పరిస్థితులలో అతడు నిన్ను ఆదుకున్నాడు. నీ కష్టాలన్నీ తనవిగా భావించుకొని, నిన్ను అన్నివేళలా అన్నివిధాలా ఆదుకున్నాడు. ఇద్దరూ ఒకే కంచంలో తిని, ఒకే మంచంమీద పడుకున్నంత ప్రియమిత్రులయ్యారు. అటువంటి ప్రియ మిత్రునికి, నువ్వు చూపవలసిన కృతజ్ఞత ఇదేనా? ఒక్క ఆడదాని ప్రేమకోసం, ప్రాణమిత్రుని హృదయాన్ని గాయపరచి, స్నేహమనే పవిత్రమైన పదానికే. శాశ్వతమైన కళంకాన్ని ఆపాదిస్తావా? వద్దు ప్రకాష్! వద్దు. మాధవిని మోహన్‌కే అందజెయ్యి. మీ స్నేహలత నవకుసుమ పరిమళాన్ని వెదజల్లనీ. ఈ యవ్వనం, ఈ అందం, ఇవన్నీ శాశ్వతం కావు. చేసిన త్యాగమే చిరకాలం నిలిచిపోతుంది. ఇప్పుడు నువ్వు నీ స్నేహితునికి ద్రోహంచేస్తే, ఆ బాధతో నువ్వు నీ జీవితాంతం ఆరని వ్యథతో, దుఃఖించవలసివస్తోంది' అని బోధించినాయ్.

భయంకరమైన తుపాను వచ్చి, వెలసినట్లయింది. ప్రకాష్ హృదయం తేలికయింది. అతని కర్తవ్యం

బోధపడింది. 'పవిత్ర ప్రేమ చాలా గొప్పది. కానీ త్యాగం అంతకంటే గొప్పది, విలువైనది' అన్న భావం అతనిలో ఉదయించింది.

ప్రకాష్ గంభీరంగా మోహన్ బుజంమీద చెయ్యి వేసి 'నీ కోరిక తప్పక ఫలిస్తుంది మోహన్! మాధవి నీది. నన్ను నమ్ము!' అని వాగ్దానం చేసాడు.

మోహన్ నేత్రాలు ఆనందంతో ప్రకాశించినాయ్.

'నీ అభిమానాన్ని, మన స్నేహాన్ని, జన్మజన్మలకైనా మరచిపోలేను ప్రకాష్! అన్నాడతను.

అర్ధరాత్రివేళ ప్రకాష్ మెల్లగా తలుపు తట్టాడు. మాధవి వచ్చి తలుపు తెరచింది. ఎదురుగా నిలబడివున్న ప్రకాష్‌ను చూసి ఆశ్చర్యపోయింది. అయినా ప్రకాష్ రాక ఆమెకు ఆనందాన్ని కలిగించింది.

'ఏవిటిది ప్రకాష్! ఇలా అర్ధరాత్రివేళ వచ్చావ్! రావోయ్! లోనికి రా! అంటూ మాధవి ప్రకాష్‌ను ఆహ్వానించింది. ప్రకాష్ నిశ్శబ్దంగా గదిలోనికి వెళ్ళి, కుర్చీలో కూర్చున్నాడు. మాధవి తలుపు గడియవేసి, వచ్చి అతని దగ్గర కూర్చుంది.

ప్రకాష్ ఆవేదనతో మాధవి వంక చూసాడు. అతని వంకనే ఎంతో తీయగా ఆప్యాయంగా చూస్తున్న మాధవికి, అతని వదనంలోని ఆవేదన దుఃఖం స్పష్టంగా గోచరించినాయ్. ఐనా, సంగతేవిటో ఆమెకు అర్థం కాలేదు. కొద్ది క్షణాలు ఇద్దరిమధ్య నిశ్శబ్దంగా గడచిపోయాయ్.

'ఏమయింది ప్రకాష్! ఎందుకా మౌనం?' అంటూ నిశ్శబ్దాన్ని చీల్చి, మాధవి ప్రశ్నించింది. ప్రకాష్ నిశితంగా మాధవి కళ్ళల్లోనికి చూస్తూ 'ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పు మాధవి! నువ్వు, నన్ను నిజంగా, మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నావా?' అన్నాడు సూటిగా.

మాధవికి నవ్వాలో, ఏడవ్వాలో బోధపడలేదు. ఏవిటీ పిచ్చి ప్రశ్న? 'రేపో, మాపో పెళ్ళిచేసుకోబోయే దంపతులమధ్య ఉదయించవలసిన ప్రశ్నేనా ఇది?' బాగుంది. ప్రకాష్‌కు మతిపోలేదుగదా అనుకుంది మాధవి.

'ఏవిటా మౌనం మాధవీ? నా ప్రశ్నకు సమాధానం కావాలి!' అన్నాడు ప్రకాష్.

మాధవి నిర్లిప్తంగా నవ్వి 'ఏవిటా ప్రశ్న ప్రకాష్! నీ ప్రశ్నకు సమాధానం నీకు తెలియదా! నీ మాధవి మనసు నీకు తెలియదా! ఐనా అడుగుతున్నావు కాబట్టి చెబుతున్నాను, విను ప్రకాష్!. నీకోసమే ఈ మాధవి నిరీక్షణ. నీ ప్రేమకోసం, లాలనకోసం, ఈ మాధవి అనుక్షణం పలవరిస్తోంది. నిన్నే తన మదిలో నిలుపుకొని, ఎల్లవేళల ఆరాధిస్తోంది. అన్నీ తెలిపిన నీకు, నీ మాధవి ఇంతకంటే ఏం వివరించి చెప్పగలదు ప్రకాష్!' అన్నది మాధవి తలవంచుకొని.

గదిలోని దీపం తన ఉజ్వల కాంతుల్ని నలువైపులా ప్రసరింపజేస్తోంది. చీకటిని పోగొడుతోంది. కానీ మాధవి చెప్పిన మాటల్ని విన్నతర్వాత, ప్రకాష్ గుండెల్లో నిండిన చీకటిని ఎవరు పోగొట్టగలరు? అతడు లోలోన కుమిలి కుమిలి దుఃఖిస్తున్నాడు. ఆ దుఃఖానికి చిహ్నంగా, అతని నయనాలనుండి, రెండు అశ్రుకణాలు రాలి, మాధవిపై పడినాయ్. మాధవి తృళ్ళిపడి తలెత్తి, ప్రకాష్‌వంక చూసింది.

'ఏవిటా బాధ ప్రకాష్! నామీద, నా ప్రేమమీద, నీకు నమ్మకంలేదా ప్రకాష్!' అంది. ప్రకాష్ గంభీరంగా నిట్టూర్పు విడిచాడు. గదిలోని గడియారం టిక్కు-టిక్కుమంటూ నిశ్శబ్దాన్ని భంగపరుస్తోంది. గభాలున ప్రకాష్, మాధవి రెండు చేతుల్ని పట్టుకున్నాడు.

'ఇంతగా నన్ను ప్రేమిస్తున్నదానివి, నాకోసం ఒక చిన్న త్యాగం చెయ్యలేవా మాధవీ?' అన్నాడు ప్రకాష్.

'చెప్పు ప్రకాషు ఏం చెయ్యాలో? నీకోసం, నీ మాధవి తన ప్రాణాలనైనా, నవ్వుతూ త్యాగం చెయ్యగలదు. నిప్పుల్లో దూకమన్నా దూకుతాను. చెప్పు ప్రకాషు! అంది మాధవి, ప్రకాషువంక మత్తుగా, తీయగా, ప్రేమగా చూస్తూ.

'ఐతే నన్ను మరచిపో! నీ ప్రేమకోసం, అనుక్షణం పరితపిస్తున్న, ఒకానొక నా ప్రియ మిత్రునికి, నీ అనురాగాన్ని అందించు. అతన్ని వివాహం చేసుకొని, ప్రేమకంటే త్యాగమే గొప్పదని చాటు మాధవి.'

ఆపైన ప్రకాషు మాట్లాడలేకపోయాడు. అతని గొంతు బొంగురుపోయింది. కన్నీళ్ళు జలజలమని రాలి నేలమీద పడుతున్నాయ్. అతని హృదయాన్ని ఎవరో

కిరాతకులు పదునైన రంపాలతో పరపరమని కోస్తున్నట్లయింది.

ప్రకాషు మాటలు విన్న తర్వాత, మాధవికి తలపై పిడుగు పడినట్లయింది. ఏమిటిది, కలా! నిజమా! ఇలా మాట్లాడుతున్నది తన ప్రకాషేనా! అన్న అనుమానం కలిగింది.

వణకుతున్న కంఠంతో 'పరిహాసమా ప్రకాషు!' అంది మాధవి. 'అవును' అని ప్రకాషు అంటే ఎంత హాయి అనుకుంది మాధవి.

'పరిహాసం కాదు మాధవి. నిజమే!. నా మిత్రుడు మోహన్, ఎంతగానో కలవరిస్తున్నాడు. నీవు లేనిదే, తన జీవితమే నిరర్థక మనుకుంటున్నాడు. అనుక్షణం నీ నామాన్నే జపిస్తూ నీ అందాన్నే ఆరాదిస్తున్నాడు. నువ్వు లేకపోతే అతను బ్రతుకలేనంటున్నాడు. పైగా మోహన్ నాకంటే ధనవంతుడు. నిన్ను అన్నివిధాలా నాకంటే ఎక్కువగా సుఖపెట్టి సంతోషపెట్టగలడు. ఏం మాధవి! మాట్లాడవేం!' అన్నాడు ప్రకాషు.

మాధవి ప్రకాషు వంక నిశితంగా చూస్తూ 'ఇవన్నీ నువ్వు మనస్ఫూర్తిగానే అంటున్నావా ప్రకాషు! నన్ను చేతులారా, ఇంకో వ్యక్తికి కట్టబెట్టాలని, నువ్వు పూర్తిగా కోరుకుంటున్నావా? నీ కంటిముందే, నీ మాధవి, ఇంకో వ్యక్తికి దక్కాలని నువ్వు నిజంగా ఆశిస్తున్నావా ప్రకాషు! 'చెప్పు ప్రకాషు చెప్పు!'. అంది మాధవి.

ప్రకాష్, మాధవి మాటల్లోని తీవ్రతకు తట్టుకోలేక బాధగా తలను తన రెండు చేతుల్తోను పట్టుకొని 'మాధవీ! మాధవీ! అసలే ఆవేదనతో అలమటించి పోతున్న నా మనస్సును మరింత చిత్రవధ చెయ్యకు నిన్ను వదలి నేను జీవించగలనా? నీవు పరుల సొత్తైతే నేను బ్రతుకగలనా? లేదు. ఐనా నన్నేం చెయ్యమంటావ్! కౄరమైన విధివిధానానికి మానవులు తల ఒగ్గక తప్పదు. ఒక పవిత్రమైన కార్యనిర్వహణకోసం, మానవులు త్యాగంచేయక తప్పదు. మోహన్ నా ప్రాణ మిత్రుడు. నన్ను అనేక కష్టాల్లో ఆదుకున్న వాడు. పైగా నిన్ను తన భార్యగా చేసే బాధ్యత నాపైనే మోపాడు. అటువంటివానికోసం, మనం ఈ త్యాగం చెయ్యక తప్పదు. మాధవి! నామాట విను!' అన్నాడు ప్రకాష్.

మాధవి ప్రకాష్ వంక తీవ్రంగా చూస్తూ వినను ప్రకాష్. వినను ఏమిటీ అన్యాయం! ఎవడో మోహన్ నీకు ప్రాణమిత్రుడే కావచ్చు. అతనికోసం నువ్వు తప్పక త్యాగం చెయ్యవలసిన అవసరం ఉందేమో! కానీ, ఎవడో ముక్కు ముఖం తెలియని వానికి భార్యను కావలసినంత త్యాగం చెయ్యవలసిన అవసరం నాకేముంది?' అంది.

ప్రకాష్ మాధవిని లేవనెత్తి 'చూడు మాధవి! అనవసరంగా ఆవేశంలో, ఆగ్రహంలో ఒళ్ళు తెలియకుండా మాట్లాడుతున్నావ్. నిదానంగా ఆలోచించు. చెట్టునిండా తీయని ఫలాలున్నాయ్. ఐతే చెట్టు ఆ పండ్లను ఆరగిస్తున్నదా! లేదు పరులకోసమే పండ్లు. నది నిండా చల్లని జలాలున్నాయ్. ఐతే నది ఆ జలాలను గ్రోలుతున్నదా? లేదు. దాహపీడితులైన వేలాది జనులు ఆ నీళ్లను త్రాగి ప్రాణాలు నిలుపుకుంటున్నారు. చెట్లు, నదులు చేస్తున్న త్యాగాన్ని, మానవులమైన మనం చెయ్యకూడదా మాధవీ? మనసు మార్చుకొని, మోహన్‌ను కట్టుకొని, మా స్నేహాన్ని, మన అనురాగాన్ని ధన్యం చెయ్యలేవా మాధవి' అన్నాడు.

'ప్రకాష్! నీ ఉపన్యాసాలు నేను వినదలచుకోలేదు. ఇష్టం వచ్చినప్పుడల్లా మార్చుకోడానికి ఇదేం నీ షర్టూ కాదు, నా చీరా కాదు. ఇది మనస్సు. పైగా ఒక స్త్రీ మనసు. అది ఏ ఒక్కర్నో ప్రేమిస్తుంది. అతనికే అంకితమవుతుంది. అంతేగానీ కంటికి కనిపించే ప్రతీ వ్యక్తికి మనసు, తనువు ధార పొయ్యడానికి నేను వేశ్యను కాను. నేను నిన్నే ప్రేమించాను. నన్ను వివాహం చేసుకొని, చరితార్థను చెయ్యి అంది మాధవి.

'అంతేనా మాధవీ, నీ అంతిమనిర్ణయం?' అన్నాడు ప్రకాష్ నిరాశగా.

మాధవి త్రాచుపాములా బుసగొడుతూ నిలబడింది ప్రకాష్ వంక తీవ్రంగా చూసి. 'అవును. అఖరాలా అంతే. ఇంకా సూటిగా చెబుతున్నాను విను ప్రకాష్! ఈ జన్మలో నేను మోహన్‌ను పెళ్లిచేసుకోవడం కల్ల. అంత త్యాగం చెయ్యగల శక్తి సామర్థ్యాలు నాకులేవు. అంత అవసరం కూడా నాకు లేదు. ఇహ నీ ఇష్టం' అంది.

ప్రకాష్ నీరసంగా లేచాడు. మెల్లగా తలుపు దగ్గ

రకు వెళ్లి తలుపు తెరిచాడు. 'మంచిది మాధవి! నేను వెళ్ళుతున్నాను. నా కోరికను నువ్వు ఇంత చక్కగా తీర్చినందుకు చాలా సంతోషం. నీ ప్రకాష్, మిత్ర ద్రోహి అనిపించుకోవడం, నీకు ఇష్టమైనప్పుడు, దాన్ని భగవంతుడు కూడా తప్పించలేడు. సరే! ఇక నన్ను మరచిపో! ఋణముంటే మరొక్కసారి, ఎప్పుడైనా, ఎక్కడైనా కలుసుకొందాం!' అన్నాడు.

మాధవి వెక్కి వెక్కి ఏడుస్తోంది ఆగదిలో. కానీ ప్రకాష్ తన హృదయాన్ని శిలగా మార్చుకొని, మాధవి వంక వెనుతిరిగి చూడకుండా, అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

'ప్రకాష్! ప్రకాష్! నన్ను అన్యాయం చెయ్యకు!' అంటూ మాధవి బిగ్గరగా అరచింది. కానీ ఆమాటలు ప్రకాష్‌కు వినపడలేదు. అవన్నీ గాలిలో కలసిపోయినాయి. నిరాశనిండిన హృదయంతో ప్రకాష్ తన గదికి చేరుకున్నాడు. కానీ గది తలుపుకు తాళంవేసి ఉంది. మోహన్, ఇంత అర్ధ రాత్రివేళ ఎక్కడకు వెళ్ళాడు చెప్మా అని అనుకుంటున్నాడు ప్రకాష్ ఇంతలో మోహన్ వచ్చేసాడు.

'హలో ప్రకాష్! ఎక్కడనుండి రాక! పైగా అర్ధ రాత్రి వేళ, నేను నిద్రలేచిచూసే సరికి నువ్వు మంచం మీద లేవు. ఎక్కడికి వెళ్ళావు చెప్మా అనుకుంటూ, నీ కోసం నేను వెతుక్కుంటూ వచ్చాను.' అంటూ తలుపుతీసాడు మోహన్.

జవాబు చెప్పకుండా లోనికి వెళ్ళి తన మంచంమీద వ్రాలాడు ప్రకాష్. మోహన్ గది తలుపువేసి తన మంచంమీద పడుకొని 'ప్రకాష్! మరపురాని వ్యక్తి సుమీ మాధవి! ఆమెను కట్టుకొనేవాడు అన్నివిధాలా అదృష్టవంతుడు. అందువల్లనే మాధవి అంటే నాకు తగని అభిమానం. ఏం చేస్తావో! అన్నాడు.

ప్రకాష్ దుఃఖంతో తన ముఖాన్ని తలగడలో దాచుకున్నాడు. 'మాధవి నన్ను ప్రేమించింది. అందువల్లనే, నేను ఎన్నివిధాల బ్రతిమిలాడినా, ఆమె నిన్ను వివాహం చేసుకోడానికి అంగీకరించడంలేదు. నన్ను ఏం చెయ్యమంటావ్' అందామనుకున్నాడు. కానీ నోటి చివరదాకా వచ్చిన మాట, అక్కడే ఆగిపోయింది.

'నువ్వు విశ్వాసఘాతకుడివి ప్రకాష్. మిత్రద్రోహివి నేను ఏ కన్యనైతే కోరుకుంటున్నానో, ఆ కన్యనే నువ్వు దక్కించుకోవాలని చూస్తున్నావ్. పైగా నంగనాచిలా నాకోసం ఏదో త్యాగం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నట్లు నటిస్తున్నావ్.' అని మోహన్ తనను నిందిస్తాడేమోనని భయపడి, ప్రకాష్ మౌనం దాల్చాడు.

'ఏమిటి ప్రకాష్ ఆలోచిస్తున్నావ్. నా ప్రశ్నకు సమాధానం ఏది' అన్నాడు మోహన్. సమాధానంగా ప్రకాష్ వెక్కి వెక్కి ఏడుస్తున్నట్లు వినిపించింది మోహన్‌కు.

'అరెరే! ఏమిటది ప్రకాష్! నీ ధోరణి నాకు అర్థం కావటంలేదు. ఎందుకలా దుఃఖిస్తున్నావ్!' అంటూ మోహన్ లేచి, ప్రకాష్ దగ్గరకు వెళ్ళాడు. లే ప్రకాష్' అన్నాడు.

ప్రకాష్ లేచి, దీనంగా మోహన్ వంక చూసి 'ఫ్రండ్! నీ ప్రకాష్, నీ కోసం తన సర్వాస్వాన్ని త్యాగం చెయ్యడానికి కూడా సిద్ధంగా ఉన్నాడు. ఐతే అది నీకు, ప్రయోజనకారి కాని పక్షంలో, నేను బ్రతికి ఉన్నా, చచ్చినా ఒక్కటే. కానీ మోహన్! నువ్వు ఒక్కవిషయం మాత్రం గుర్తుంచుకో. ఈ ప్రకాష్ నీకు కలలో కూడా ద్రోహం చెయ్యడు. నన్ను నమ్ముతావా మోహన్. నమ్మి నన్ను ఎప్పుడూ క్షమించగలవా మోహన్! అన్నాడు.

మోహన్ పకపక మని నవ్వుతూ 'అరే ప్రకాష్! నీకు నిజంగా పిచ్చిపట్టింది. లేకపోతే ఏమిటిదంతా? త్యాగం ఏమిటి, ద్రోహం ఏమిటి? సరే? నువ్వేం చేసినా నిన్ను నేను క్షమిస్తాను, సరేనా! ఇక హాయిగా నిద్రపో! విష్‌యు హేపీ డ్రీమ్స్' అన్నాడు. ప్రకాషు గుండెనిబ్బరం చేసుకొని 'మోహన్! ఒక ముఖ్యమైన విషయం చెబుతాను. విను' అన్నాడు. 'అబ్బబ్బా! నేనేం వినదలచుకోలేదురా! నిద్రవస్తోంది.' అంటూ మోహన్ హాయిగా నిద్రపోయాడు.

ఆ మర్నాడు సాయంకాలం నాలుగు గంటలయింది. ప్రకాషు, మోహన్ లిద్దరూ పార్కులో కూర్చున్నారు. రేడియోలో నుండి తీయని సంగీతం వినవస్తోంది.

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

ప్రకాషు విచారంగా కూర్చొని రాత్రి జరిగిన సంఘటన తలచుకొంటున్నాడు.

ఉన్నట్టుండి మోహన్ 'అరె ప్రకాషు! అదుగో మాధవి!' అంటూ మాధవిగారూ ఓ మాధవిగారూ అంటూ గట్టిగా కేక వేసాడు.

పార్కులో ఒక మూలకూర్చొని, రాత్రి జరిగిన సంఘటన తలచుకొని బాధపడుతున్న మాధవి, ఆ కేకకు త్రుళ్ళిపడింది. 'అంత గట్టిగా అరుస్తున్న ఆ అనాగరికుడెవరు చెప్మా' అని చూసింది. దగ్గర్లో మోహన్, ప్రకాషు కనిపించారు. ప్రకాషును చూడగానే మాధవి కళ్లు ఆనందంతో మెరిసాయ్, మాధవిని చూసి ప్రకాషు తలవంచుకున్నాడు.

'దయచేసి, ఇలా ఒకసారి వస్తారా, మాధవిగారూ!' అని పిలిచాడు మోహన్ అంత మర్యాదగా పిలుస్తున్నప్పుడు, వెళ్లకపోవడం బాగుండదనిపించింది మాధవికి. లేచి ప్రకాషు మోహన్‌లు ఉన్న చోటకు వచ్చింది.

'అలా కూర్చోండి మాధవిగారూ!' అన్నాడు మోహన్. ముగ్గురూ మెత్తని పచ్చగడ్డిమీద కూర్చున్నారు. చల్లనిగాలి, అలసిన శరీరాలకు తీయగా గిలిగింతలు పెడుతూ ఉండగా వారి ముగ్గురి మధ్య కొద్ది సేపు నిశ్శబ్దం తాండవించింది.

'అరే ప్రకాషు! సిగ్గు విడిచి మాధవిగారికి చెప్పరా!' అన్నాడు మోహన్ చిలిపిగా మాధవి వంక చూస్తూ.

'మాధవి నిర్ణయం మారదు. అది నాకు తెలుసు. తిరిగి మాధవికి మోహన్ గురించి, ఏమని చెప్పేది? చెప్పినా ఏంలాభం' అనుకుంటూ మౌనం దాల్చాడు ప్రకాషు.

'సరే! చెప్పలేవన్నమాట! ఏం జేస్తాం నేనే మాధవిగారికి చెబుతాను' అన్నాడు మోహన్.

'ఆగు!' అన్నాడు ప్రకాషు.

కానీ ప్రకాషు మాటల్ని, మధ్యలోనే త్రుంచుతూ 'ఆగరా? ఆ! చూడండి! మాధవిగారూ! నా పేరు గోపాల్' అన్నాడు.

'ఆ! అంటూ ఆశ్చర్యంతో చూసాడు ప్రకాషు. మారుపేరు చెప్పవలసిన ఖర్మవీడికేం పట్టింది?' అనుకున్నాడు ప్రకాషు.

ప్రకాషు భావాన్ని అర్థం చేసుకున్న మోహన్, మెల్లగా కన్నుగీటాడు ప్రకాషు నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

'మాధవిగారూ? మీరు ఇంకో విధంగా భావించకపోతే ఒక చిన్నరిక్వస్టు. నా మనసులోని ఆశను తీరుస్తారని చాలా ఆశిస్తున్నాను' అన్నాడు మోహన్.

మాధవికి చాలా కోపం వచ్చింది. ఏమిటీ చూరువ ? పెళ్ళికాని యువతితో, మాట్లాడవలసిన మాటలేనా అవి! మాధవి కోపంతో నిలబడింది.

'మిస్టర్! మేనర్సులేకుండా మాట్లాడుతున్నారు ?! అంది.

'అబ్బెబ్బే! అనవసరంగా ఆగ్రహించకండి మేడమ్' అసలు సంగతేదో తెలుసుకోకుండా, లేచి పోతు

మీ వ్యవసాయాభివృద్ధికి...!




Manufacturing 3/4 H.P. — 3 Phase Motors 960. 1450 & 2890 R.P.M. 2 H.P. to 20 H.P., —2 Phase Monoblock Sets. 1/2 H.P. to 2 H.P. — Single Phase Motors.

Dealers:—M/s. SIVARAJ ELECTRICALS, No. 53, Linghi Chetty Steet, Madras-1

Sole Agents for Eastwhile Hyderabad & Maharashtra State, M/s Vijai, Agencies Giriraj Lane, Bank Steet, Hyderabad-1

Agents for Cuddappah, Dt ;—

M/S. V.S. REDDY & Co.,
4/189, Dr. Ayyaswami Pillai St.,
**CUDDAPPH (A.P.)**

న్నారే! మిమ్మల్ని ప్రాణానికి మిన్నగా ప్రేమిస్తున్న వానిని పెళ్ళి చేసుకోమని నా కోరిక. ఏమంటారు?' అన్నాడు మోహన్.

'షటప్!' అంది మాధవి పిచ్చి కోపంతో.

మోహన్, నిరాశతో నిట్టూర్పువిడుస్తూ 'ఇహ నేను చేయగలిగిందేదిలేదు. నేనీ మాధవిగారిమీద ఎన్నో ఆశలు పెట్టుకొని చెప్పాను. కానీ ఈమే; తన్ను మనసారా ప్రేమిస్తున్న ప్రకాషును పెండ్లాడనంటోంది' అన్నాడు.

'ప్రకాషు, మాధవీ, ఇద్దరూ ఒకేసారి తృళ్ళిపడి 'ఆ' అన్నారు. ఒకేసారి మాధవి ఆనందంతో ఉప్పొంగిపోతూ 'మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను గోపాల్ గారూ? కనీసం మీరైనా నా ఉద్దేశాన్ని గ్రహించారు. ప్రకాషును పెండ్లిచేసుకోవడం నాకూ ఇష్టమే!' అంది మాధవి సిగ్గుతో తలవంచుకోని.

జరిగిందేమిటో సరిగ్గా అర్థం గాక అయోమయంగా చూస్తున్నాడు ప్రకాషు. మాలతి తిరిగి తలఎత్తి 'చూడండి గోపాల్ గారూ! ఈ ప్రకాషు స్నేహితుడెవరో మోహన్ అనే ఆయన నన్ను ప్రేమిస్తున్నాడట. కాబట్టి నేను ఆ మోహన్ గారినే పెళ్ళాడాలని, ఈ ప్రకాషుగారి పంతం! ఇదేమైనా న్యాయంగా ఉందా?' అంది.

'ఆగు మాధవి! ఈ గోపాల్,...' అనుబోయాడు ప్రకాషు.

'నాన్సెన్స్! అంటూ బిగ్గరగా బ్రహ్మాండంగా హడలిపోయేటట్టు అరిచాడు మోహన్. మాధవి, ప్రకాషులు తృళ్ళిపడ్డారు.

'మాధవిగారూ! ప్రకాషుగారి పంతం వట్టి అర్థం లేనిది. పైగా పూర్తిగా అన్యాయం. మీరూ, మీరూ మనసారా ప్రేమించుకోవడం ఏవిటీ! మధ్య, ఆ మోహన్ గాడెవడో పానకంలో పుడకలా ప్రవేశించడమేమిటి? కొట్టేవాణ్ని ఆ వెధవను!' అన్నాడు మోహన్.

'అవునండి, రాత్రంతా ఒకేలా ఏడ్చాను. కనిపిస్తే కొట్టాలని ఉంది!' అంది మాధవి.

'కొట్టకండి బాబోయ్!' అంటూ దూరంగా తప్పుకున్నాడు మోహన్.

'అబ్బే! కొట్టేది మిమ్మలి కాదండి. ఆ మోహన్ గాణ్ణి!' అంది మాలతి.

ప్రకాషు లేచి 'ఓ మాధవి! ఆ మోహన్....' అనబోయాడు.

'ఆగవోయ్!' తిరిగి మోహన్ పెద్దగా అరిచి 'ఆ మోహన్ గాణ్ణి నాకు వదిలేయ్.

ఆ! ఇప్పుడు మీరిద్దరూ ప్రమాణం చెయ్యండి. ఈ పార్కు సాక్షిగా, వీస్తున్న చల్లని గాలి సాక్షిగా, చెట్లు సాక్షిగా, పిట్టలసాక్షిగా త్వరలో మేమిద్దరం భార్యాభర్తలం కాబోతున్నాం, అనండి అన్నాడు మోహన్.

ప్రకాషు, మాధవి తమలో తాము నవ్వుకున్నారు. అదే అదును అనుకొని మోహన్, వారిద్దరి చేతుల్ని కలిపేసాడు. కాబోయే వధూవరులు నవ్వుకున్నారు.

మాధవి వెళ్ళిపోయిన తర్వాత 'ఏవిటిదంతా మోహన్!' అన్నాడు ప్రకాషు. మోహన్ చిన్నగా నవ్వి. ప్రకాషు బుజం తట్టి 'డియర్ ప్రకాషు! నన్ను నువ్వు క్షమించాలి. నువ్వు మాధవిని ప్రేమిస్తున్నావని తెలియక, ఏదోదో వాగాను. నిన్న అర్థరాత్రివేళ, నేను నీ వెనకాలే వచ్చాను. మాధవి గదిలో, నీకు మాధవికి జరిగిన సంభాషణ అంతా విన్నాను. నేనెంత నీచమైన కోరికను నిన్ను కోరేనో, అప్పుడుగానీ నాకు అర్థం కాలేదు. కానీ నీలాంటి స్నేహితుణ్ణి పొందగలిగిన నేను చాల అదృష్టవంతుణ్ణి. తోటి మిత్రునికోసం, తన హృదయంలోని నిశ్చల ప్రణయరాగాన్ని కూడా ధారపొయ్యడానికి సిద్దపడ్డావ్! ప్రకాషు! యు ఆర్ రియల్లీ ఏ గ్రేట్ మాన్.' అంటూ అభినందించాడు మోహన్.

'మోహన్!' అంటూ కౌగలించుకున్నాడు ప్రకాషు.

మోహన్ నవ్వుతూ 'అరే ప్రకాషు! ఒకే చిన్న కోరిక. మీరిద్దరూ పెళ్ళిచేసుకొనేవరకూ, గోపాలే, మోహన్ అని మాధవితో చెప్పకు!' అన్నాడు.

కానీ ప్రకాష్, మాధవితో ఆ సంగతి చెప్పేసాడు. ఎప్పుడు?

పెళ్లైన మొదటి రాత్రి, ఏకాంతంగా, గదిలో తన కౌగలిలో మాధవి తీయని కలలు కంటున్నప్పుడు.

'మాధవీ! ఆనాడు పార్కులో మోహన్ కనిపిస్తే కొట్టాలని ఉందని, గోపాల్ తో అన్నావే, ఆ గోపాలే మోహన్ సుమా! అలా మారుపేరు పెట్టుకొని, తిరిగి మన కలియికకు సూత్రధారి అయ్యాడు' అని.

'ఏవిటేవిటీ! బాబోయ్! గోపాలే, మీ స్నేహితుడైన మోహనా!' అంటూ తృళ్ళిపడి కళ్ళు మూసుకుంది మాధవి.